## క్లుప్తంగా

### గంగమ్మను దర్శించుకున్న అంజూరు



జాతరకు హాజరైన అంజూరు శ్రీనివాసులు

శ్రీకాళహస్తి: పట్టణంలోని ఎన్టీఆర్‌నగర్‌లో మంగళవారం గంగమ్మ జాతర ఘనంగా నిర్వహించారు. భక్తులతోపాటు శ్రీకాళహస్తీశ్వరాలయ పాలకమండలి మాజీ చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు అమ్మవారిని దర్శించుకున్నారు. ఆయనకు నిర్వాహకులు ఆత్మీయ స్వాగతం పలికి, దర్శనానంతరం తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో యోగి యాదవ్, రేవంత్‌యాదవ్, మున్నారాయల్, శ్రీవారి సురేష్, పఠాన్ ఫరీద్, పీఎం చంద్ర, పెరుమాల్ చౌదరి, పఠాన్ ఫరీద్, సోము, ఇర్ఫాన్ తదితరులు పాల్గొన్నారు.

### ఎన్టీఆర్ అభిమానుల అన్నదానం



అన్నదానం చేస్తున్న అభిమానులు

బుచ్చినాయుడుకండ్రిగ: సినీనటుడు జూనియర్ ఎన్టీఆర్ జన్మదినం సందర్భంగా మంగళవారం ఆయన అభిమానులు మురళీనాయుడు, హరిప్రసాద్, మహేష్, అశోక్, కిరణ్, సెల్వీ, బాలయ్య బుచ్చినాయుడుకండ్రిగలోని బస్టాండ్‌వద్ద కేక్ కట్ చేసి, అన్నదానం చేశారు. జూనియర్ ఎన్టీఆర్ వంద జన్మదినాలు జరుపుకోవాలని ఆకాంక్షించారు.

### పిచ్చాటూరులో భారీ వర్షం



కురుస్తున్న భారీ వర్షం

నాగలాపురం: పిచ్చాటూరు మండలంలో మంగళవారం భారీ వర్షం కురవడంతో వేసవి ధాటికి అల్లాడుతున్న ప్రజలకు ఉపశమనం కలిగింది. వర్షం కురవడంతో రైతులకు వేసవి దుక్కి దున్నడం సులభతరం కానుంది. రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. వేహూరు, వెంగలత్తూరు, రామగిరి, చెంచురాజు కండ్రిగ గ్రామాల్లో భారీ వర్షం పడడంతో వీధులన్నీ జలమయమయ్యాయి.

### ఆడపిల్లల సాధికారతకు కిశోరి వికాసం



బాలికలకు శిక్షణ ఇస్తున్న అంగన్‌వాడీ సూపర్‌వైజర్ మారియమ్మ

నాగలాపురం: బాలికల సాధికారత లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన కిశోరి వికాసం వేసవి శిక్షణ కార్యక్రమం మండలంలోని అడవికొడియంబేడు అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం సీడీపీఓ శోభారాణి ఆదేశాల మేరకు సూపర్‌వైజర్ మారియమ్మ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాలికలు సమాజంలో సమాన హక్కు పొందాలి, లింగ వివక్ష నిర్మూలించేందుకు ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారు. ఈ శిక్షణలో భాగంగా బాలికల కు లైఫ్ స్కిల్స్, వ్యక్తిగత పరిశుభ్రత, నైతిక విలువలు తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ ప్రమీల పాల్గొన్నారు.

### టిప్పర్ సీజ్



పోలీస్ స్టేషన్ ఎదురుగా ఉన్న టిప్పర్

రేణిగుంట: మండలంలోని కరకంబాడి సమీపంలో మట్టి అక్రమ రవాణా చేసేందుకు సిద్ధంగా ఉన్న టిప్పర్‌ను మైనింగ్ అధికారులు సీజ్ చేసి రేణిగుంట అర్బన్ పోలీసులకు అప్పగించారు. కరకంబాడి పంచాయతీలో కొంతకాలంగా మట్టి అక్రమ రవాణా చేస్తున్నారనే ఫిర్యాదులు అందడంతో మైనింగ్ అధికారులు మంగళవారం దాడులు చేశారు. మట్టిని అక్రమంగా రవాణా చేసేందుకు సిద్ధంగా ఉన్న టిప్పర్‌ను స్వాధీనం చేసుకున్నారు. మైనింగ్ అధికారులు సీజింగ్ లెటర్ ఇచ్చిన తర్వాత తదుపరి చర్యలు తీసుకుంటామని ఎస్సై అరుణ్ కుమార్ రెడ్డి తెలిపారు.

### దరఖాస్తుల ఆహ్వానం

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తి ఆర్టీసీ డిపోలో ఆన్‌కాల్ డ్రైవర్లుగా పనిచేసేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు మేనేజర్ మునిచంద్రయ్య మంగళవారం ప్రకటనలో తెలిపారు. హెవీ లైసెన్సు తీసుకుని 18 నెలలు పూర్తయిన వారు ఆధార్ కార్డు, దరఖాస్తును తీసుకుని తమ కార్యాలయంలో ఈ నెల 24వ తేదీ లోపు ఉదయం 10.30 నుంచి సాయంత్రం 5గంటల లోపు సమర్పించాలన్నారు. మరిన్ని వివరాలకు 9959297947, 90637 74464 సెల్ నంబర్లను సంప్రదించాలన్నారు.

## నాడు కళకళ.. నేడు వెలవెల..!

- పార్క్ పర్యవేక్షణ విస్మరించిన పంచాయతీ అధికారులు
- ఎటుచూసినా పిచ్చిమొక్కలు, గడ్డి
- అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారిన వైనం

రేణిగుంట బిస్మిల్లానగర్‌లోని తుడా పార్క్ కళావిహీనంగా దర్శనమిస్తోంది. ఒకప్పుడు ప్రజలు, పిల్లలతో కళకళలాడిన పార్క్ ఇప్పుడు వెలవెలబోతోంది. పంచాయతీ అధికారులు దీని పర్యవేక్షణ గాలికొదిలేయడం ఈ దురవస్థ ప్రాప్తించిందని ప్రజలు మండిపడుతున్నారు.



అధ్వానంగా ఉన్న వాకింగ్ ట్రాక్



పాడైపోయిన చిన్నారుల ఆట వస్తువులు



రేణిగుంట: బిస్మిల్లా నగర్‌లో 2091లో కోటి రూపాయల తుడా నిధులతో పార్క్ నిర్మించారు. వాకింగ్ ట్రాక్, చిన్నారులు ఆడుకునేందుకు వివిధ రకాల వాటిని ఏర్పాటు చేయడంతో అప్పట్లో సందడిగా ఉండేది. కాలక్రమంలో పంచాయతీ అధికారులు నిర్వహణ, పర్యవేక్షణ బాధ్యతలను విస్మరించారు. ఫలితంగా పిచ్చిమొక్కలు, గడ్డితో వాకింగ్ ట్రాక్, బెంచీలు కనిపిస్తున్నాయి. అలాగే చిన్నారులు ఆడుకునే ఆటవస్తువులు పూర్తిగా దెబ్బతిన్నాయి. పార్కులోని నీటి కొళాయి లీకేజీతో నీళ్ల వృథా అవడమే కాకుండా పరిసరాలు బురదమయం అవుతునానయి. పార్క్‌కు వాచ్‌మన్ లేకపోవడంతో రాత్రి పూట అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారింది. చీకటి పడితే చాలు యువకులు పార్కులో తిష్ట వేసి మత్తు పదార్థాలు సేవిస్తున్నారని స్థానికులు చెప్పారు.



పార్క్ ముఖద్వారం



నీళ్లు లీకేజీ అవుతున్న వాటర్ పైపు

### కెపాసిటర్ల నిర్వహణపై శ్రద్ధ చూపండి

నారాయణవనం: త్రీఫేజ్ విద్యుత్ కనెక్షన్లను కలిగిన వినియోగదారులు తమ మీటర్లకు అమర్చిన కెపాసిటర్లను సక్రమమైన నిర్వహణతో విద్యుత్ బిల్లులను తగ్గించుకోవచ్చునని ట్రాన్స్‌కో ఏఈ జయప్రకాష్ తెలిపారు. కొత్తగా అమర్చిన అదానీ కంపెనీ మీటర్లకు కెపాసిటర్ల అనుసంధానంలో మెళకువలను పాటించకుంటే బిల్లులు పెరిగే అవకాశం ఉందని అన్నారు. ఆయన మీడియాతో మాట్లాడుతూ కొత్త మీటర్లతో బిల్లులు పెరిగిందని వినియోగదారులు ఫిర్యాదు చేస్తున్నారని అన్నారు. త్రీఫేజ్ మీటర్‌కు అనుసంధానం చేసిన కెపాసిటర్‌లో నిరంతర విద్యుత్ సరఫరాతో మీటర్ తిరిగే అవకాశం ఉందని అన్నారు. కెపాసిటర్‌ను మోటా ర్ల స్టార్టర్ల అవుట్ గోయింగ్ పాయింట్‌కు అనుసంధానం చేయడంతో విద్యుత్ వినియోగం ఆదాతో బిల్లులు తగ్గుతుందని అన్నారు. మండలంలో వాణిజ్య సంస్థలు, మరమగ్గాలు, మిల్లులు, పిండి మరలు, కుటీర పరిశ్రమల వినియోగదారులు ట్రాన్స్‌కో సిబ్బందిని సంప్రదించి, కెపాసిటర్ల సంధానాన్ని సరి చేసుకోవాలని ఆయన సూచించారు.

### సత్యవేడు తహశీల్దార్‌గా రాజశేఖర్



సత్యవేడు: తిరుపతి జిల్లా కలెక్టర్ ఎస్.వెంకటేశ్వర్ ఆదేశాల మేరకు సత్యవేడు తహశీల్దార్‌గా రాజశేఖర్‌ను నియమించినట్లు సమాచారం. ప్రస్తుతం రాజశేఖర్ వరదయ్యపాళెం తహశీల్దార్‌గా పనిచేస్తూ సత్యవేడుకు ఇన్‌చార్జిగా ఉన్నారు. ఇక్కడ పనిచేస్తున్న తహశీల్దార్ టీవీ సుబ్రమణ్యం డిప్యూటేషన్‌పై పిచ్చాటూరు బదిలీ అయ్యారు. సత్యవేడు రెగ్యులర్ తహశీల్దారుగా రాజశేఖర్ నియమితులయ్యారు.

## కల్యాణ వెంకన్నకు వసంతోత్సవం



వసంతోత్సవంలో ఉభయ నాంచారులతో కల్యాణ వెంకన్న

నారాయణవనం: శ్రీపద్మావతీ సమేత కల్యాణ వెంకటేశ్వరస్వామి మంగళవారం సాయంత్రం స్వామివారు శ్రీదేవీ, భూదేవీ సమేతుడై వసంతోత్సవంలో పాల్గొన్నారు. మొక్కులు తీర్చుకున్న భక్తులపై పరిచారకులు సుగంధ పరిమళ ద్రవ్యాన్ని చిలకరించారు. బ్రహ్మోత్సవాల ధ్వజావరోహణమైన మరుసటి రోజు సాయంత్రం వసంతోసవాన్ని నిర్వహిస్తారు. ఉదయం సుప్రభాత సేవతో ఆలయాన్ని తెరచిన అర్చకులు నిత్యపూజలు, గంట, నైవేద్యం తదితర కార్యక్రమాలను పూర్తి చేశారు. సాయంత్రం శ్రీవారు ఉభయ నాంచారులతో తెల్లటి పట్టు వస్త్రాలను, స్వర్ణాభరణాలను, సుగంధ పుష్ప మాలికలు అలంకరించుకుని తిరుచ్చి వాహనం అధిష్ఠించారు. మాడవీధుల్లో భక్తులు, మహిళలు కర్పూర హారతులు ఇచ్చి మొక్కులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా శ్రీవారి పరిచారకులు తిరుచూర్ణ, సుగంధ ద్రవ్యాల మిశ్రమాన్ని అందరిపై చిలకరించారు. ఆలయానికి చేరుకున్న దేవరులకు ఆస్థానం నిర్వహించారు. పై కార్యక్రమాలను ఆలయ అధికారి నాగరాజు, ఆర్జితం అధికారి భరత్, ప్రధాన అర్చకులు శ్రీధరభట్టాచార్య తదితరులు పర్యవేక్షించారు.

## అధికార పార్టీ ఆక్రమణలు దారుణం



మాట్లాడుతున్న మణినాయుడు

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని కల్లివెట్టు గ్రామంలో బీసీలకు సంబంధించిన ఇంటి స్థలాలను అధికార పార్టీ నాయకులు ఆక్రమించుకోవడం దారుణమని వైఎస్‌ఆర్ సీపీ మండల కన్వీనర్ కొణతనేని మణినాయుడు మండిపడ్డారు. ఆయన మంగళవారం బుచ్చినాయుడుకండ్రిగలోని పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. ఆయన మాట్లాడుతూ వైఎస్‌ఆర్ సీపీ ప్రభుత్వ హయాంలో కల్లివెట్టు గ్రామంలోని జగనన్న కాలనీలో 125 మంది పేదలకు ఇంటి స్థలాలు ఇచ్చారన్నారు. 125 మందిలో 36 మందికి సంబంధించిన ఇంటి స్థలాలను అధికార పార్టీకి చెందిన కొందరు ఆక్రమించుకున్నారని తెలిపారు. ఆక్రమణను అడ్డుకోవడానికి ప్రయత్నిస్తే అధికార పార్టీ నాయకులు దౌర్జన్యం చేసి, దాడి చేస్తున్నారన్నారు. ఇంటి స్థలాల ఆక్రమణను అడ్డుకోవాలని రెవెన్యూ అధికారుల దృష్టికి పలుమార్లు తీసుకెళ్లినా పట్టించుకోకపోవడం దారుణమని తెలిపారు. ఇంటి స్థలాలను ఆక్రమించుకోవడంతో స్థలాలు లేక ఒక్కో ఇంటిలో మూడు కాపురాల వారు ఉంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రెవెన్యూ అధికారులు స్పందించి, అడ్డుకోకపోతే జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తామని హెచ్చరించారు. స్టేట్ ఎస్సీ సెల్ కార్యదర్శి ఉగ్గుమూడి గురునాథం, జిల్లా కార్యదర్శి జొన్నల గోపాల్‌రెడ్డి, నాయకులు గురవయ్య, జయచంద్రనాయుడు పాల్గొన్నారు.

### ట్రాక్టర్ ఢీకొని యువకుడు దుర్మరణం

ఏర్పేడు: బైక్‌ను ట్రాక్టర్ ఢీకొన్న ప్రమాదంలో ఓ యువకుడు దుర్మరణం పాలయ్యాడు. ఈ ఘటన పూతలపట్టు- నాయుడుపేట జాతీయ రహదారి ఏర్పేడు మండలం మేర్లపాక టోల్‌గేట్ సమీపంలో మంగళవారం రాత్రి చోటుచేసుకుంది. మేర్లపాక దళితవాడకు చెందిన మనోజ్(25) వ్యక్తిగత పనుల మీద ఏర్పేడుకు వెళ్లి తిరిగి బైక్‌లో ఇంటికి బయలుదేరాడు. మేర్లపాక టోల్‌గేట్ సమీపంలో వెళుతుండగా శ్రీకాళహస్తి నుంచి తిరుపతి వైపు వెళుతున్న ఓ ట్రాక్టర్ బైక్‌ను ఢీకొంది. ఈ ప్రమాదంలో మనోజ్ అక్కడికక్కడే మృతిచెందాడు. విషయం తెలిసి ఏర్పేడు సీఐ శ్రీకాంత్‌రెడ్డి ప్రమాద స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రికి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

### త్వరితగతిన అభివృద్ధి పనులు పూర్తి చేయండి



అధికారులతో మాట్లాడుతున్న కమిషనర్

తిరుపతి తుడా: నగరంలో జరుగుతున్న అభివృద్ధి పనులను త్వరగా పూర్తి చేయాలని నగరపాలక సంస్థ కమిషనర్ మౌర్య అధికారులను ఆదేశించారు. నగరపాలక సంస్థ పరిధిలోని జీవకోన, రాజీవ్ గాంధీ కాలనీ తదితర ప్రాంతాల్లో అభివృద్ధి పనులతో పాటు పారిశుధ్య పనులను ఇంజినీరింగ్, హెల్త్, టౌన్ ప్లానింగ్, రెవెన్యూ అధికారులతో కలసి పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ జీవకోన వంటి ప్రాంతాల్లో ప్రజలకు అవసరమైన అన్ని అభివృద్ధి పనులు చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. అలాగే అక్కడ జరుగుతున్న అభివృద్ధి పనులను త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఇంటింటి చెత్త సేకరణ పక్కగా చేయాలని, ఎక్కడా చెత్తకుప్పలు లేకుండా పారిశుధ్య పనులు చేపట్టాలన్నారు. కమిషనర్ వెంట సూపరింటెండెంట్ ఇంజినీర్ శ్యాంసుందర్, మున్సిపల్ ఇంజినీర్ గోమతి, తుడా ఈఈ రవీంద్ర, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువఅన్వేష్, రెవెన్యూ అధికారి రవి ఉన్నారు.

### లారీ ఢీకొని మోటార్ సైక్లిస్టులకు గాయాలు



చికిత్స పొందుతున్న కార్తీక్

శ్రీకాళహస్తి: రోడ్డుప్రమాదంలో విద్యార్థి గాయపడిన సంఘటన మంగళవారం రాత్రి తొట్టంబేడు మండలం కన్నలి వద్ద పీఎన్ జాతీయ రహదారిపై చేసుకుంది. వివరాలు..నెల్లూరు నుంచి తిరుపతి వైపు తనస్నేహితుడు సచిన్‌తో కలిసి మోటార్ సైకిల్‌లో కార్తీక్ బయలుదేరాడు. కన్నలి వద్ద ఓ గుర్తు తెలియని లారీ వీరి ద్విచక్ర వాహనాన్ని ఢీకొంది. సచిన్‌కు స్వల్ప గాయాలయ్యాయి. తీవ్రంగా గాయపడిన కార్తీక్‌ను స్థానికులు శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం తిరుపతి రుయాకు తరలించారు. రెండవ పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## గంగమ్మకు సారె సమర్పణ



ఆలయం వద్ద బియ్యపు శ్రీవాణిరెడ్డి

శ్రీకాళహస్తి: పట్టణంలోని ఎన్టీఆర్ నగర్‌లో మంగళవారం గంగమ్మ జాతర వైభవంగా జరిగింది. అమ్మవారికి శ్రీకాళహస్తి మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి సతీమణి బియ్యపు శ్రీవాణిరెడ్డి సారె సమర్పించి, దర్శించుకున్నారు. ఆమెకు స్థానికులు ఘన స్వాగతం పలికారు. మొక్కులు చెల్లించిన అనంతరం ఆమెకు నిర్వాహకులు తీర్థ ప్రసాదాలు అందజేశారు. అనంతరం ఆమె భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో శివకుమార్‌యాదవ్, కంచి గురవయ్య, పఠాన్ ఫరీద్, మున్నా రాయల్, చంద్ర, రేవంత్, యోగ, బావాజీ, సూరి, సాయి, రాజశేఖర్, ఇమ్రాన్, భాను, ముని, ప్రవీణ్, మోహన్,రెడ్డి బాషా, చెంచు, సుదీర్ తదితరులు పాల్గొన్నారు. అలాగే, శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించారు.

## లేబర్ కోడ్లను రద్దు చేయాలని ధర్నా



ఆర్డీఓకు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

శ్రీకాళహస్తి: కార్మికుల గొంతునొక్కుతున్న నాలుగు లేబర్ కోడ్లను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ శ్రీకాళహస్తి ఆర్డీఓ కార్యాలయం వద్ద సీఐటీయూ, వ్యవసాయ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో మంగళవారం ధర్నా చేశారు. సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు అంగేరి పుల్లయ్య మాట్లాడుతూ, లేబర్ కోడ్లను రద్దు చేసి కార్మిక చట్టాలను పునరుద్ధరించాలన్నారు. కార్మికులకు కనీస వేతన చట్టాన్ని అమలు చేయాలని, కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలని, సమాన పనికి సమాన వేతమివ్వాలని కోరారు. ఉపాధి పథకానికి బడ్జెట్లో నిధులు పెంచి రోజుకు రూ.600 వేతనం, 200 రోజుల పని దినాలు కల్పించాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి దాసరి జనార్దన్ డిమాండ్ చేశారు. వేసవి అలవెన్సును యథాతథంగా కొనసాగించాలని అన్నారు. ఉపాధి నిధులను ఇతర పథకాలకు మళ్లించరాదని విజ్ఞప్తి చేశారు. పంటలకు మద్దతు ధర కల్పించి ప్రభుత్వమే రైతుల నుంచి కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం ఆర్డీఓ భానుప్రకాష్ రెడ్డికి వినతి పత్రం అందజేశారు. శ్రీకాళహస్తి ప్రాంతీయ కార్యదర్శి గంధం మణి, సీఐటీయూ శ్రీకాళహస్తి ప్రాంతీయ కార్యదర్శి పెనగడం గురవయ్య, ప్రజా నాట్యమండలి జిల్లా నాయకుడు వేణు, సీఐటీయూ నాయకులు రాపూరు సుబ్రమణ్యం, గురునాథం, రాజా తదితరులు పాల్గొన్నారు.

## హైవే పనులపై గాజులమండ్యం వాసుల ఆక్షేపణ



హైవే సిబ్బందితో మాట్లాడుతున్న సర్పంచ్ గంగారి రమేష్, గ్రామస్తులు

రేణిగుంట: తిరుపతి-చెన్నై హైవేలో నాలుగు లేన్ల పనులపై గాజులమండ్యం గ్రామస్తులు ఆక్షేపించారు. హైవే విస్తరణ కోసం అధికారులు భూ సేకరణ చేసి పలు ఇళ్లను నేలమట్టం చేశారు. ఇప్పుడు హైవేకు సంబంధించి డ్రైనేజీ పనులు చేస్తున్నారు. హైవే ప్రధాన కాలువను గ్రామ వీధి కాలువ కన్నా ఎత్తుగా నిర్మిస్తున్నారు. మంగళవారం సర్పంచ్ గంగారి రమేష్, ఈఓ గిరిధర్ గ్రామస్తులు హైవే పనుల వద్దకు వెళ్లి సైట్ ఇంజినీర్‌తో చర్చించారు. గ్రామంలోని వీధి కాలువల లోని నీళ్లు ప్రధాన కాలువలోకి కలిసేలా పనులు చేయాలని కోరారు. సర్పంచ్ మాట్లాడుతూ, ఇదే సమస్యపై హైవే అథారిటీ అధికారులకు ఈఓ ఫిర్యాదు చేసినా ఇంతవరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. హైవే కాలువ వీధి కాలువ కన్నా ఎత్తులో నిర్మించటం వల్ల గ్రామస్తులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, సమస్యను పరిష్కరించకపోతే హైవే పనులను అడ్డుకుంటామని హెచ్చరించారు.

## గంగమ్మా! కాపాడరావమ్మా..

- అట్టహాసంగా మరుపొంగళ్లు
- తాతయ్యగుంట ఆలయానికి పోటెత్తిన భక్తులు
- నారికేళాల అలంకరణలో గంగమ్మ



నారికేళ అలంకరణలో దర్శనమిస్తున్న గంగమ్మతల్లి

తిరుపతి కల్చరల్: మమ్ములను కాపాడరావమ్మా.. గంగమ్మ తల్లీ అంటూ భక్తజనం శ్రీతాతయ్యగుంట గంగమ్మను వేడుకున్నారు. తిరుపతి గంగజాతర తర్వాత వచ్చే ఐదు మంగళవారాలు గంగమ్మకు భక్తులు మరుపొంగళ్లు సమర్పిస్తారు. అందులో భాగంగా మొదటి మంగళవారం భక్తులు పొంగళ్లు పెట్టి గంగమ్మకు మొక్కులు చెల్లించి ప్రణమిల్లారు. ఆలయంలో అమ్మవారి మూలవిరాట్‌కు అభిషేకం చేశారు. అనంతరం నారికేళాలతో అమ్మవారిని సర్వాంగ సుందరంగా ప్రత్యేక అలంకరణలో కొలువుదీర్చి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. మొన్న జాతరలో వేషాల మొక్కులు చెల్లించని భక్తులు ఈ వారం పలు వేషాల్లో వచ్చి ఆలయ ప్రదక్షిణ చేసి అమ్మవారి పాదాల వద్ద ప్రణమిల్లి మొక్కులు చెల్లించారు. ఆలయ ఈఓ కె. మమత అమ్మవారి దర్శన ఏర్పాట్లను పర్యవేక్షించారు.

### గంగమ్మకు మొక్కులు

మరుపొంగళ్ల సందర్భంగా రాయలసీమ రంగస్థలి కళాకారులు వివిధ వేషాలు ధరించి అమ్మవారికి మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో రంగస్థలి చైర్మన్ గుండాల గోపినాథ్‌రెడ్డి, సంఘ సభ్యులు పాల్గొన్నారు. అలాగే రెడ్డి సామాజిక వర్గానికి చెందిన వారు జాతర అనంతరం తొలి మంగళవారం గంగమ్మకు భక్తి ప్రపత్తులతో సారె సమర్పించారు. హరిణి టవర్స్ నుంచి సారెను ఊరేగింపుగా తీసుకొచ్చి ఆలయంలో అమ్మవారికి సారెను సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో మునీశ్వర్‌రెడ్డి, లీలాకృష్ణారెడ్డి, మోహన్‌రామిరెడ్డి, రెడ్డెప్పరెడ్డి, దామోదర్‌రెడ్డి, సిద్ధారెడ్డి, శ్రీమన్నారాయణరెడ్డి, రాజారెడ్డి, దాసుమునిరెడ్డి, సుమతి పాల్గొన్నారు.



వేయికళ్ల దుత్తలతో ఆలయ ప్రదక్షిణ చేసి మొక్కులు తీర్చుకుంటున్న భక్తులు



గంగమ్మకు సారె తీసుకొస్తున్న రెడ్డి సామాజిక వర్గం

### రాష్ట్రంలో దగా పాలన

తిరుపతి కల్చరల్: రాష్ట్రంలో మంచి ప్రభుత్వం అంటూ కూటమి ప్రభుత్వం సంబరాలు జరుపుకుటోందని, ఇది మంచి ప్రభుత్వం కాదు.. మందిని ముంచే ప్రభుత్వమని, వాగ్దానాలను మింగే ప్రభుత్వం, మహిళలు, కార్మిక వర్గానికి ద్రోహం చేసే ప్రభుత్వమని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చంద్రశేఖర్‌రెడ్డి, కె.రాధాకృష్ణ మండిపడ్డారు.